
## కథ




# చింటూగాడి చిద్విలాసం

కె. వరలక్ష్మి

చింటూగాడి అల్లరి భరించలేక వాణ్ణి బళ్ళో వేసెయ్యాలని నిర్ణయించుకుంది నిర్మల.

''మూడేళ్ళు నిండి మూడు నెలలైనా కాలేదు, వాడికప్పుడే బడేవిటే'' అని మొత్తుకుంది వాడి బామ్మ వర్ధనమ్మ.

తల్లి తన చిన్నప్పుడు వీపు విమానం మోత మోగించడం గుర్తుకొచ్చి-

'అసలుకంటే వడ్డీ ముద్దు అంటే ఇదేమరి' అని సణుక్కున్నాడు సుబ్రహ్మణ్యం.

''సీసా పాలైనా వదలని పసికందుని బడికి పంపించేస్తారుట్రా? పప్పూ నెయ్యీ వేసి మెత్తగా కలిపిన అన్నాన్ని గోరుముద్దలు తినిపిస్తూంటే సరిగా తినడం కూడా రాని పసివాడి మీద మీకెందుకురా ఇంత కక్ష?'' అని కళ్ళనీళ్లు పెట్టుకుందావిడ.

''అవును, వాడింకా పసిపిల్లాడే మీకు. వాడి తోటి వాళ్లంతా ఆర్నెల్ల క్రితం నుంచే బడికెళ్తున్నారు. మీ గారాబం వల్ల వాడింకా పీక తగిలించిన సీసా వదలకుండా లీటర్లు లీటర్లు చిక్కటి పాలు గుటుక్కు గుటుక్కుమని ఖాళీ చేసేస్తున్నాడు. పొట్ట నిండా పాలుంటే ఇంక అన్నం ఎందుకు వెధవకి?'' అంది నిర్మల.

''అయ్యో అయ్యో లక్షణంగా రామచంద్రమూర్తి అని వాళ్ల తాతగారి పేరుపెడితే దాన్నొదిలేసి చింటూనో బంటూనో అంటూ ఇష్టం వచ్చినట్టు పిలుస్తున్నారు సరే దానికీ వాళ్లపిల్లాడు వాళ్లిష్టంలే అని నేనేవంటల్లేదు. ఇప్పుడు వెధవ గిధవ అని అడ్డమైన తిట్లూ తిడుతోంది. ఇదంతా సహించడం నావల్ల కాదమ్మా'' అంటూ ముక్కు చీదడం ప్రారంభించింది వర్ధనమ్మ.

''మీరు మరీ ఓవర్‌యాక్షన్ చెయ్యకండి. కరాటే ఫైట్లూ కత్తియుద్ధాలూ చేసి ఇంటికొచ్చినవాళ్ళని ఐదునిముషాల్లో పారిపోయేలా చేస్తున్నవాణ్ణి వెనకేసుకొచ్చి వాణ్ణి చెడగొడతారా ఏవిటి! బళ్ళో వేస్తే మానేస్తాడు. ఆయా తినిపిస్తే అన్నానికి అలవాటుపడతాడు. వాడి బంగారు భవిష్యత్తంతా ఆ బళ్ళోనే ఉంది'' కళ్ళు అరమోడ్చి కలల్లో తేలిపోతూ అంది నిర్మల.

వంటింట్లో భళ్ళుమని చప్పుడైంది.

''అయ్యో పాడుపిల్లి వంటింట్లో దూరినట్టుందే'' అని పరుగెత్తేరు అత్తాకోడళ్ళు.

ఎప్పుడు లేచాడో చింటూగాడు దోసెల పిండి గిన్నె స్టవ్వు గట్టుమీంచి లాగినట్టున్నాడు. అది నేల మీద బోర్లాపడి ఉంది. పిండంతా వాడి పాదాల చుట్టూ పరచుకుని ఉంది. వీళ్లని చూసి అటు రెండడుగులు, ఇటు రెండడుగులు వేసి పాదాల నిండా పిండి అంటించుకున్నాడు.

నిర్మల వాణ్ణొక్కటి బాదాలని వెళ్ళబోయింది.

''ఇంకా నయమమ్మా గిన్నె పిల్లాడి కాళ్ళ మీద పడింది కాదు. మా నాయనే, మా రాంపండే'' అంటూ వాణ్ణి చంకనేసుకుని ''కన్న వాళ్ల దిష్టే తగుల్తోందమ్మా పిల్లాడికి'' అని కోడలి వైపు కొరకొరా చూసి, వాడి కాళ్ల పిండంతా తన చీరకి పులుముతున్నా లెక్కచెయ్యకుండా బైటికెళ్లిపోయింది వర్ధనమ్మ.

బైట పనిమనిషి బట్టలుతికే కుళాయి పూర్తిగా విప్పేసి ఉంది. ధారగా పడుతున్న నీళ్లల్లో చింటూగాడు తడుస్తూ గెంతుతున్నాడు. పక్కనే వర్ధనమ్మ మోకాలిపైన తడుముకుంటూ నిలబడి ఉంది. నొప్పి ఓర్చుకోలేక ఆవిడ కళ్లల్లోంచి నీటిచుక్కలు టపటపా కిందపడుతున్నాయి. ఆవిడ మాత్రం మొహం నిండా నవ్వు నింపుకుని ''ఒరి నీ పళ్ళు బంగారంగానూ, ఎంత గట్టిగా కండ ఊడొచ్చేలా కొరికేవురా'' అని మురిసిపోతోంది.

''ఏమైందత్తయ్యా?'' అంది నిర్మల.

ఆవిడ గతుక్కుమని వెనక్కి తిరిగి చూసి ''ఏవీ లేదమ్మా, ఏదో చంటాడు కుళాయిలో నీళ్ళు చూసి ఆడుకోవాలని సరదాపడ్డాడు. నేను వాడి కాళ్ళొక్కటే కడిగేసి తీసుకొచ్చేస్తానేమోనని..... అయినా ఈ మాత్రానికే తోసుకుంటూ వచ్చేసేరెందుకు? వాణ్ణి ఏం చేసేద్దావని'' మూతి మూడు వంకర్లు తిప్పింది.

మొహమొహాలు చూసుకున్నారు నిర్మల, సుబ్రహ్మణ్యం.

ఇక ఏవైనా సరే వాణ్ణి బళ్ళో వెయ్యాల్సిందే అని కళ్ళతోనే నిర్ణయించుకున్నారు.

నిర్మల వెళ్లి కుళాయి కట్టేసేలోపల ఆవిడ చింటూగాణ్ణి చంకనేసుకుని కుంటుకుంటూ దూరంగా వెళ్లిపోయింది. సుబ్రహ్మణ్యం కేలెండరు తీసి తిథులు, నక్షత్రాలు లెక్కపెట్టేడు. మాఘ మాసం కావడం వలన మంచి ముహూర్తం వెంటనే దొరికింది.

పక్క వీధిలో స్కూలైతే పారిపోయి వచ్చేస్తాడేమోనని నాలుగు వీధులకవతల ఉన్న స్కూలుకెళ్లి వాకబు చేశారు. అక్కడ మేడమ్ వీళ్ళని ఎంత అజ్ఞానులు అన్నట్టు చూసింది.

''ఇప్పుడు అప్లికేషన్ ఇవ్వండి. సెలవుల తర్వాత రీ ఓపెన్‌కి జాయిన్ చేసుకుంటాం. ఈలోపల మీరు కూడా ప్రిపేరవ్వండి'' అంది.

అప్పుడు గుర్తుకొచ్చింది పిల్లల్ని కేజీ క్లాసులో జాయిన్ చెయ్యాలంటే తల్లిదండ్రులు కూడా స్కూలు వాళ్లు పెట్టే ఎంట్రన్స్ టెస్టు పాసవ్వాలని ఫ్రెండ్స్ చాలామంది చెప్పడం.

''సరే కేజీ క్లాసొద్దులెండి కనీసం ప్లేస్కూల్లోనైనా సీటివ్వండి'' అని బ్రతిమిలాడి ఏడ్చి కన్నీళ్ళు కార్చి చింటూ గాడికి ప్లే స్కూల్లో సీటు సంపాదించేరు. దానికి వాళ్ళు కట్టించుకున్న ఫీజు చూసి కళ్ళు తిరిగి కింద పడబోయేడు సుబ్రహ్మణ్యం.

చింటూగాడ్ని జాయిన్ చెయ్యాల్సిన ముహూర్తం ఇంకా వారం రోజులుంది. ఈలోపల సుబ్రహ్మణ్యం ఫ్రెండు+కొలీగ్ రమేష్‌కి పెళ్లి కుదిరింది. అమ్మాయి నచ్చడంతో పెళ్ళి చూపుల్లోనే ముహూర్తాలు పెట్టేసుకున్నారు.

''నాకు మాత్రం పెద్దవాళ్ళెవరున్నారు, మా అమ్మానాన్న తప్ప. మీరంతా ఇప్పుడే వచ్చి పెళ్ళి పెద్దలుగా నిలబడాలి'' అని పట్టుపట్టేడు రమేష్.

రమేష్‌తో బాటు సుబ్రహ్మణ్యం కూడా సెలవు పెట్టేశాడు.

మొదటిరోజు నిర్మల, సుబ్రహ్మణ్యం, రమేష్ కలిసి షాపింగ్‌కి వెళ్ళేరు. వాళ్ళు తిరిగొచ్చేసరికి రమేష్ అమ్మ, నాన్న దిగులు మొహాలేసుకుని తలలు పట్టుకుని కూర్చుని ఉన్నారు. చింటూగాడు దర్జాగా కాలుమీద కాలేసుకుని వాళ్ళ బామ్మ వొడిలో చేరబడి సీసాలో పాలు ఖాళీ చేస్తున్నాడు.

ఏం జరిగిందని అడగబోయిన రమేష్ వాళ్లమ్మ చూపుల్ని అనుసరించి తను అపురూపంగా కుండీల్లో పెంచిన గులాబీ తోటవైపు నడిచేడు. వెనకే నిర్మల, సుబ్రహ్మణ్యం.

అక్కడ కుండీల్లో విరిసి ఉదయం అందాలొలికిన గులాబీలన్నీ తుంచిపోసి ఉన్నాయి. మొగ్గలు కూడా మిగల్లేదు.


''ఏదో చంటాడు తెలీక కోసేడు. పువ్వులే కదా, అవేమన్నా బంగారు పూలా? డబ్బులు పడేస్తే బజార్లో బోలెడన్ని'' అంటోంది వర్ధనమ్మ వెనుక నుంచి.

ఈసారి తలలు పట్టుకోవడం నిర్మల, సుబ్రహ్మణ్యం వంతైంది.

రమేష్‌కి ఆ చిన్ని గులాబీ తోటంటే ఎంతిష్టమో వాళ్లకి తెలుసు. రాబోయే పెళ్లికూతుర్ని ఆహ్వానించడానికి మరిన్ని కొత్తరంగులు కొన్నానని మొన్ననే చెప్పాడు.

రాని నవ్వుని మొహం మీదికి తెచ్చుకుని ''ఫర్వాలేదులెండి.....ఫర్వాలేదు'' అన్నాడు రమేష్.

భోజనాలై, అందరూ కాస్సేపు కునుకుతీసి లేచేరు. టీ పెడదామని నిర్మల వంటింట్లోకి వెళ్లి కెవ్వుమని అరిచింది. పాదాలు మునిగేటన్నీ నీళ్ళు





## ఆసియా సౌందర్యరాశి

దివి నుంచి బాలీవుడ్‌కి దిగి వచ్చిన అందాలభామగా ఇపుడు మల్లికాషెరావత్ కీర్తికిరీటాలను అందుకుంటోంది. ఎందుకంటే జాకీచాన్‌తో కలిసి నటించిన నాటి నుంచి ఈమె బిజీ అయిపోయింది. హాంకాంగ్‌కి చెందిన ఫ్యాషన్ మ్యాగజైన్ దృష్టిలో ఈమె పడింది. ఎప్పుడూ కొత్తదనాన్ని ఆశించే ఈ భామ ఆసియాలో ఉన్న వందమంది అసమాన సౌందర్య రాశుల్లో స్థానం సంపాదించుకుంది. ఎప్పటికప్పుడు తన అందానికి మెరుగులు దిద్దుకుంటూ ఉండే మల్లికాకి ఇంతకంటే కావాల్సింది ఏముంటుంది చెప్పండి?

న్నాయి వంటింట్లో. వంటింటి మధ్యలో బాసింపట్టు వేసుక్కూచుని నీళ్లమీద చేతుల్తో బాదుతూ ఆడుకుంటున్నాడు చింటూ గాడు.

''ఈ నీళ్ళేమిట్రా వెధవా'' అనరిచింది.

''ఏనే వొంపేచా'' అన్నాడు వాడు ధీమాగా.

ఎప్పుడొచ్చేడో వంటింట్లో పట్టి ఉంచిన నీళ్లన్నీ వంపేశాడు.

పెళ్లికని తెచ్చిపెట్టిన పప్పులు, ఉప్పులు, బియ్యం మూటలు అన్నీ నానుతూ కన్పించాయి. నిర్మల గుండె గుభేలుమంది. పొద్దున్నే నీళ్ళన్నీ పట్టి పెట్టేరు. మళ్లీ రెండురోజుల వరకూ నీళ్ళురావు. తాగేందుకు గుక్కెడు నీళ్లైనా లేకుండా ఫిల్టర్ టేప్ కూడా విప్పేశాడు.

ఆ వంటింటికి నీళ్ళు బైటికి పోయే దారి మూసుకుపోయిందంట. ఆ నీళ్లన్నీ ఎత్తిపోసేసరికి నిర్మలకి నడుములు పడిపోయాయి. రమేష్ వద్దంటున్నా వినకుండా సుబ్రహ్మణ్యం మినరల్‌వాటర్ తెప్పించి అన్నిట్లో నింపించాడు.

ఆ సాయంకాలం రమేష్ సెల్‌ఫోన్ కనపడక ఒకటే వెతుకుతున్నాడు. ఇంట్లో బట్టలు, పుస్తకాలు అన్నీ తిరగేసి మరగేశాడు. ఎక్కడ వదిలేసి ఉంటాడో గుర్తుచేసుకోడానికి అదే పనిగా ప్రయత్నిస్తున్నాడు. ఇకపోయిందని నిర్ణయానికొచ్చేశాడు. ఇదేదో అశుభసూచకంగా ఉందని రమేష్ కొంచెం నిరుత్సాహపడ్డాడు.

''నా సెల్ నుంచి రింగ్ చేసి వాడెవడ్నో రిక్వెస్ట్ చేద్దాం. అవసరమైతే ఏమైనా డబ్బులిద్దాం. బహుశా బట్టలషాపులోనో, ఆటోలోనో వదిలేసి ఉంటావ్'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

రెండుసార్లు చేసి ''రింగవుతోంది కానీ అవతలి వాడెవడో ఫోనెత్తట్లేదురా''అన్నాడు సుబ్రహ్మణ్యం. మూడోసారి సరిగా గమనించి అందరూ గేటు బైటికి పరిగెత్తేరు. బైట రోడ్డు మీద చింటూ గాడు చేతులు వెనక్కి పెట్టుకుని పచార్లు చేస్తున్నాడు. వాళ్లమ్మ కాస్సేపటి క్రితం వేసిన వాడి కొత్త ప్యాంటు జేబులోంచి రమేష్‌సెల్ రింగవుతోంది.

మర్నాడు షామియానా కట్టేవాళ్ళు చేతులు జోడించేశారు. వాళ్ళో వేపు గడకర్ర నిలబెడుతూంటే రెండోవైపు కర్ర పడిపోతోంది. చింటూ గాడు ఆ కర్రపైకి ఎక్కడానికి ప్రయత్నిస్తున్నాడు.

పెళ్లిమంటపంలో పచ్చని కొబ్బరి బొండాల మీద పెట్టి ఉంచిన ఆడపెళ్లివారి తాళిబొట్టు మాయమైపోయింది. పంతులు గార్ని అందరూ దుయ్యబట్టుకున్నారు. 'అంత నిర్లక్ష్యమైతే ఎలా?' అని ఆయన బిక్కమొహం వేసేడు. తీరాచూస్తే స్టేజి కింద దుప్పట్లో దూరి చింటూగాడు తాళిబొట్టుతో కాలికీ వేలికీ ముడేసుకుని ఆడుకుంటున్నాడు.

పెళ్ళయ్యేవరకూ నిర్మల వాణ్ణి వదలకుండా పట్టుక్కూచుంది. వాడి చెయ్యి అరటిపళ్ళ అత్తలాల మీదికి వెళ్లినప్పుడల్లా ఆ చేతిమీద ఒక్కటి కొడుతోంది.

పెళ్లి ముగిసింది. హారతివ్వడానికి ముత్తయిదువుల్ని రమ్మన్నారు. నిర్మల చింటూగాడ్ని కిందికి దించి హారతి పళ్ళెం పట్టుకోబోయింది. పళ్లెంలో కర్పూరం బిళ్లలు వాడికి పంచదార గుళికల్లా కన్పించినట్టున్నాయి. వాటిని గుప్పిట్లో చిక్కించుకుని ఒకటే పరుగు. కర్పూరం అంటించడానికి వెలిగించిన అగ్గిపుల్లను పట్టుకుని ఆదాటున నోరు తెరిచేసిన పంతులుగారి వేలు చురుక్కుమంది. వెలిగించడానికి ఇంకో పేకెట్టు కర్పూరం బిళ్లలు సిద్ధంగా లేక నలుగురు చింటూ గాడి వెంటపడి వాడి చేతిలోంచి లాక్కునేసరికి అవి గుండపిండైపోయాయి. ఆ గుండనే వెలిగించిన పంతులుగారితోపాటూ పెళ్లిమంటపం అంతా నవ్వులో మునిగితేలింది.

ఆ రాత్రికి నాగవల్లి. పూల బంతులాడిస్తూంటే చింటూగాడెళ్లి పెళ్లికొడుకు వొళ్లో కూచున్నాడు. పైగా బంతులు తానే విసురుతానని మారాం. వాళ్లమ్మ ఎన్నిసార్లు లాగబోయినా రావడం లేదు. రమేష్ ముద్దుగా వాణ్ణి అలా కూచోబెట్టుకునే తతంగాలన్నీ పూర్తిచేశాడు.

అందరూ నవ్వులు.

మర్నాడు సుబ్రహ్మణ్యం రమేష్ నుంచి వీడ్కోలు తీసుకుంటూ ''సారీరా, మా చింటూ గాడితో నీకు కలిగిన అసౌకర్యానికి. ఇలాంటి కొడుకు ఇంకెవరికీ వద్దురా'' అన్నాడు సిగ్గుగా.

''నాక్కావాలిరా'' అన్నాడు రమేష్ వెంటనే ''వాడి అల్లరే కదరా ఈ పెళ్లిలో ఇన్ని నవ్వులు పూయించింది. వాడు తుంచిన గులాబీల స్థానంలో కొత్త మొగ్గలేస్తాయి. అన్ని మొగ్గల్లోనూ వాడి అల్లరి కన్పించి మళ్లీ మళ్ళీ నవ్వులు పూస్తాయి'' అన్నాడు ఆనందంగా.

చింటూ గాడ్ని ప్లేస్కూల్లో వేసారు.

మొదటిరోజు వీలైనన్ని బొమ్మలు విరగ్గొట్టేడు.

రెండోరోజు పిల్లలందర్నీ కొట్టి గిచ్చి ఏడిపించాడు.

మూడోరోజు టీచర్ సెల్‌ఫోన్ టేబుల్ మీద ఉంటే చేతికొచ్చిన పాయింట్లన్నీ నొక్కి వదిలేశాడు. ఆవిడ సాయంకాలం గమనించి చూసుకుంటే ముందురోజు వేయించుకున్న మూడువందల యాభై రూపాయల కార్డు మొత్తం ఖాళీ అయిపోయింది.

నాలుగోరోజు స్కూలువాళ్ళు సుబ్రహ్మణ్యానికి వార్నింగ్ ఇచ్చారు–పిల్లాడు అల్లరిచేస్తే పనిష్మెంటు పేరెంట్స్‌కి ఇస్తామని.

★